సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 29 । జనవరి । 2023


భక్తజన సందోహం మధ్యన తేరుపై కడప రాయుని విహారం (ఇన్‌సెట్) ఉభయ దేవేరులతో తేరుపై కొలువుదీరిన కడప రాయుడు

కదిలింది.. కడప రాయుని రథం

కడప కల్చరల్ : జనం.. జనం.. భక్తజనం.. ఆ జన సంద్రం మధ్యన కడప రాయుని రథం కదిలింది. బ్రహ్మదేవుడు సారథ్యం వహించినట్లుగా అలంకరించిన రథం విశ్వ తేజోమూర్తి సూర్యుని సాక్షిగా, మహా మేరు పర్వతంలా జనసంద్రం మధ్యన ఆ భారీ రథం గంభీరంగా సాగింది. దేవునికడప మాఢవీధుల్లో జనం సందడి నెలకొంది. భక్తులు రథంపై స్వామిని దర్శించుకుని జయజయధ్వానాలు చేస్తూ జన్మధన్యమైందని మైమరచిపోయారు. కడప రాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించారు. మిద్దెలు, మేడలపై నుంచి కూడా భక్తులు స్వామి రథంలో దేవదేవుడిని తిలకించి పులకించారు. కడప రాయుడు దేవునికడప

ఘనంగా రథోత్సవం

శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఉదయం స్వామి వారిని రథంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. దాదాపు మధ్యాహ్నం 2.30 గంటల వరకు దర్శనాల కోసం భక్తులు బారులు తీరి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు, స్థానిక అధికారులు తొలి పూజలు చేసి కొబ్బరికాయలు, హారతులు ఇచ్చి రథాన్ని కదిలించారు. దేవునికడప, పాతకడప, మోడమీదిపల్లె యువత కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో కదం తొక్కుతూ రథ చక్రాల కింద వెనక నుంచి కొయ్య మొద్దులు వేసి వెదురు కర్రల సాయంతో ముందుకు కదిలించారు. ముందువైపు భక్తజనం పోటీలుపడి గొలుసులతో రథాన్ని లాగారు. మొక్కులు గల భక్తులు రథ చక్రాల కింద గుమ్మడికాయలను ఉంచి ఆ ముక్కలను ప్రసాదంగా స్వీకరించారు. అర్చకులు అడుగడుగునా రథంపై నుంచి ప్రజలకు స్వామి వారి హారతులిచ్చారు. రథంపై నుంచి యువతను ప్రోత్సహిస్తూ రథోత్సవం సక్రమంగా సాగేందుకు సూచనలిచ్చారు. ఈ మంగళకరమైన ఘట్టాన్ని తిలకించేందుకు దేవునికడప మాఢ వీధులన్నీ జనమయమయ్యాయి. ఆ వీధుల్లోని మిద్దెలు, మేడలన్నీ జనంతో నిండిపోయాయి. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య సాయంత్రం రథం ముందున్న చోటుకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు 'అరసం' జిల్లా మహాసభ

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ మహాసభ ఆదివారం ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సభకు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస కె.చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథులుగా డాక్టర్ సంజీవమ్మ, డాక్టర్ టక్కోలు మాచిరెడ్డి, ప్రత్యేక అతిథులుగా రచయిత పాలగిరి విశ్వప్రసాద్, పాత్రికేయుడు ఎస్ఎండీ బాషా పాల్గొంటారన్నారు. అరసం కార్యవర్గ సభ్యుడు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, డాక్టర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డిలు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 11.30 గంటలకు జరగనున్న రెండవ సమావేశానికి డాక్టర్ తవ్వా వెంకటయ్య అధ్యక్షతన వహిస్తారని, వైసీవీ కథలు, అభ్యుదయ దృక్పథం అంశంపై ప్రసంగిస్తారన్నారు. డాక్టర్ ఎన్.గంగాధర్‌రెడ్డి, జి.రత్నకుమారి, సి.రవీంద్ర, డి.రవి, పవన్‌కుమార్‌రెడ్డిలు వివిధ సాహిత్య అంశాలపై విశ్లేషణలు చేయనున్నట్లు వివరించారు.

వైవీయూ దూరవిద్య ఉప సంచాలకుడిగా శ్రీధర్‌బాబు


డాక్టర్ ఎం.శ్రీధర్‌బాబుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్య

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఉప సంచాలకుడిగా డాక్టర్ ఎం. శ్రీధర్‌బాబు నియమితులయ్యారు. వీసీ ఆచార్య జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు విశ్వవిద్యాలయంలో అప్లైడ్ మ్యాథమ్యాటిక్స్ సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న ఈయనకు ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ అధికారులు, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య పి.ఎస్. షావలీఖాన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

108లో ఈఎంటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్: అరబిందో 108 అంబులెన్స్ సంస్థలో ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మేనేజర్ నాగరాజు తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్స్ (బీజెడ్‌సీ/సీబీజెడ్, బయో టెక్, మైక్రోబయాలజీ, బీ ఫార్మసీ, ఎఫ్‌జెడ్‌సీ, నర్సింగ్), ఎంఎల్‌టీ, జీఎన్ఎం విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 31వ తేదీ, ఫిబ్రవరి 1వ తేదీన కడపలోని నిహార్ స్కిల్ సెంటర్, నాగరాజుపేట (జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 7901243559, 7901242018 ను సంప్రదించాలని సూచించారు.

శ్రీరస్తు.. శుభమస్తు

సందడిగా పెళ్లి పందిళ్లు.. మోగుతున్న బాజాభజంత్రీలు.. పట్టుచీరల గలగలలు...పెద్దల ఆశీస్సులు...యువత హడావుడి....అంతటా కల్యాణ రాగాలు.. జిల్లాలో మార్చి వరకు అత్యంత శుభకరమైన, మంగళకరమైన వివాహ ముహూర్తాలు ఉండడంతో తమ బిడ్డలకు మంచి జరుగుతుందని పెద్దలు వివాహాలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ మాసమంతా ముహూర్తాలు లేవు గనుక ఆ తర్వాత ఎండా కాలం తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వివాహాలు కానిస్తున్నారు. జిల్లా అంతటా పెళ్లి సందళ్లు కనిపిస్తున్నాయి..

- జిల్లా వ్యాప్తంగా శుభకార్యాల సందడి
- మోగుతున్న పెళ్లి బాజాలు
- పురోహితులు, వివిధ రంగాల కళాకారులకు డిమాండ్



రాజంపేట టౌన్: మాఘమాసం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా పెళ్లిళ్ల సందడి ఊపందుకుంది. ముహూర్తాలు ఉన్న రోజు పెళ్లిబాజాలు మోగుతున్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహప్రవేశాలు, ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు, అన్నప్రాసన, ఉపనయనం, అక్షరాభ్యాసం వంటి శుభకార్యాలకు అనేక మంది ప్రజలు ముహూర్తాలను కూడా ఖరారు చేసుకున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి వివాహాలు, ఇతర శుభకార్యాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి 17వ తేదీ వరకు వివిధ రోజుల్లో శుభముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు.

కల్యాణ మండపాలకు డిమాండ్

గత ఏడాది నవంబర్‌లో, డిసెంబర్ మొదటి వారంలో మంచి ముహూర్తాలు ఉన్న కారణంగా వేలాది వివాహాలు జరిగాయి. అయితే ఆ సమయంలో వివాహాలు నిర్వహించుకోలేక పోయిన వారు, ఇటీవల వివాహాలు కుదిరిన వారు మాఘమాసం, ఫాల్గుణ మాసంలో వివాహ కార్యక్రమాలను తలపెట్టుకున్నారు. అందువల్ల ముహూర్తాలు ఉన్న రోజుల్లో అన్ని కల్యాణ మండపాలు బుక్ అయిపోయాయి. కల్యాణ మండపాలు దొరకని వారు తమ ఇళ్లవద్ద, విశాలమైన ఖాళీ స్థలాల్లో వివాహాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

జోరుగా సాగుతున్న అనుబంధ వ్యాపారాలు

వివాహాలు, శుభకార్యాల సీజన్ ప్రారంభం కావడంతో వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా దుస్తులు, బంగారు, అలంకరణ వస్తువులు, శుభకార్యాలకు అవసరమయ్యే సామగ్రి, పూల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. శుభకార్యాలు ముగిశాక దగ్గరి బంధువులు కొద్ది రోజుల పాటు శుభకార్యాలు జరుపుకున్న వారి ఇంటిలో ఉండనున్నందున నిత్యావసర వస్తువుల వ్యాపారం కూడా ఊపందుకుంది.

అనేక మందికి ఉపాధి

కరోనా సమయంలో ఉపాధి లేక వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే గత ఏడాది నుంచి కరోనా ప్రభావం లేక పోవడం దీనికి తోడు నవంబర్ నుంచి శుభముహూర్తాలు ప్రారంభం కావడంతో అనేక మందికి చేతినిండా పనిదొరికి పుష్కలంగా ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం వివాహాలు, శుభకార్యాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులకు, డెకరేషన్, మంగళ, బ్యాండు వాయిద్య కళాకారులకు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్స్ (ఆర్కెస్ట్రా), క్యాటరింగ్, బ్యూటీపార్లర్ నిర్వాహకులకు, ట్రావెల్స్ ఏజెన్సీలకు మెండుగా డిమాండ్ ఏర్పడింది. అందువల్ల ఆయా వ్యాపార వర్గాల వారికి చేతినిండా పని లభించడంతో శుభకార్యాలు వారి ఉపాధికి దోహదపడుతున్నాయి.

మంచి ముహూర్తాలు గనుక



జనవరి నుంచి మార్చి వరకు గల ముహూర్తాలు వివాహాలకు ఎంతో శుభకరమైనవి. అందుకే పెద్దలు తమ బిడ్డలకు ఈ ముహూర్తాలలోనే వివాహాలు జరిపిస్తున్నారు. మిగతా మాసాల కంటే ఈ ముహూర్తాలు మంచివన్న భావనతో వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మరో రెండు నెలలు ఈ సందడి కొనసాగుతుంది.

– విజయ్‌భట్టర్, వేద పండితులు, కడప


మంగళ స్నానం కోసం డెకరేషన్

స్టేటస్ కోసం.. తగ్గేదేలే

ప్రస్తుతం ధనవంతులు తమ పిల్లలకు జరిపే వివాహాలు వారి స్టేటస్‌కు సింబల్‌గా మారాయి. ఆర్థిక పరిపుష్టి గల వారు వివాహాల కోసం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా ప్రతిదీ గొప్పగా ఉండేలా చూసుకుంటున్నారు. వివాహ సమయంలో డెకరేషన్, విందు కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అలాగే అత్యాధునిక కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీయించేందుకు కూడా లక్షల్లో ఖర్చు చేస్తున్న వారు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వివాహ విందులో పసందైన వంటలు ఉండేందుకు పేరెన్నికగన్న క్యాటరింగ్ సంస్థలతో అల్పాహారం, భోజనం ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది వివాహానికి వచ్చిన వారికి విలువైన గిఫ్ట్‌లు కూడా ఇస్తున్నారు.


వివాహ రిసెప్షన్ డెకరేషన్

ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని అధిగమించాలి

- కలెక్టర్ విజయరామరాజు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉపాధి హామీ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిపై డ్వామా పీడీ యదుభూషణరెడ్డితోపాటు కలెక్టర్, ఏపీడీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన పనులను ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అన్ని మండలాల్లో కూలీల పని దినాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా ఏపీఓలు, ఏపీడీలు, పీఓలు, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అత్తిరాలలో టెంకాయల వేలంపాట

రాజంపేట రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. ఏడాదిపాటు టెంకాయలు విక్రయించుకునేందుకు నిర్వహించిన వేలం పాటను మందరం గ్రామానికి చెందిన మల్లెం రెడ్డెయ్య రూ.6లక్షల 70వేలకు దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జి.కొండారెడ్డి, దేవస్థానం చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ధర్మకర్తలు రోహిత్, ఈశ్వరయ్య, జూనియర్ అసిస్టెంట్ పోలి సుధీష్ రెడ్డి, ఆలయ ప్రధాన పూజారి కె పద్మనాభశాస్త్రి, ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి దేశానికే ఆదర్శం

ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి దేశానికే ఆదర్శమని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, పాఠశాల విద్య ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ) బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో డీఈఓ దేవరాజు అధ్యక్షతన జిల్లాలోని ఎంఈఓలు, అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలకు పదవ తరగతి పరీక్షలు, విద్యాపథకాల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని వారంలో ఒక రోజు విద్యాశాఖ అధికారులు తప్పని సరిగా పర్యవేక్షించడంతోపాటు స్వయంగా విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. విద్యాశాఖకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రతి నెలలో విడుదల చేస్తున్న వీడియోలను ఉపాధ్యాయులు తప్పని సరిగా చూడాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి

వందశాతం ఉత్తీర్ణతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతకు ప్రతి ప్రధానోపాధ్యాయుడితోపాటు సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలపై ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. అలాగే ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు నైట్ విజన్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇప్పటికే పది పరీక్షలకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేశారని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ శోభారాణి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశు, ఆర్ఐపీఈ భానుమూర్తిరాజు, కడప ఎంఈఓ పాలెం నారాయణతోపాటు పలు మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ, డీఆర్‌సీ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈనెల 30వ తేదీన జెడ్పీ సర్వసభ్య సమావేశం, అలాగే జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 9.00 గంటలకు జెడ్పీ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. అలాగే అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు కలెక్టరేట్‌లో వైఎస్సార్ జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. రెండు సమావేశాలకు సంబంధించి జిల్లా అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

ఏఆర్‌ మొబిలైజేషన్‌లో ఫైరింగ్‌ శిక్షణ


శిక్షణల్లో పాల్గొన్న ఏఆర్‌ సిబ్బంది

కడప అర్బన్‌ : ఏఆర్‌ మొబిలైజేషన్‌లో భాగంగా శనివారం ఏఆర్‌ సిబ్బందికి వార్షిక ఫైరింగ్‌ శిక్షణను నిర్వహించారు. కడప నగర శివార్లలోని రాజీవ్‌ స్మృతివనం వద్ద ఉన్న ఫైరింగ్‌ రేంజ్‌లో ఏఆర్‌ సిబ్బందికి ఫైరింగ్‌లో మెలకువలను వివరించారు. ఏఆర్‌ డీఎస్పీ రమణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో తుపాకీని ఎలా ఉపయోగించాలి, తుపాకీ నిర్వహణ, ఎస్‌ఎల్‌ఆర్‌ తుపాకీతో డ్రిల్‌ నిర్వహణపై ఏఆర్‌ పోలీస్‌ ఉన్నతాధికారులు మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సోమశేఖర్‌నాయక్‌, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వీఆర్‌ఓకు తీవ్ర గాయాలు


గాయపడిన వీఆర్‌ఓ శ్రీనివాసులరెడ్డి

రాజుపాళెం : బస్సు ఢీకొనడంతో రాజుపాళెం వీఆర్‌ఓ గుద్దేటి శ్రీనివాసులరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. మండల ఇన్‌చార్జి ఎస్‌ఐ కృష్ణంరాజు నాయక్‌ కథనం మేరకు.. విధి నిర్వహణలో భాగంగా శనివారం శ్రీనివాసులరెడ్డి పెద్దముడియం మండలంలోని ఉప్పలూరు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో రాజుపాళెంకు వస్తుండగా ఈ సంఘటన జరిగింది. మండలంలోని కుమ్మరపల్లె వంక వద్ద ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ అజాగ్రత్త కారణంగా బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌ నడుపుతున్న శ్రీనివాసులరెడ్డి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విషాదం నింపిన గ్యాస్‌ ప్రమాదం

- ఇప్పటికే ఇద్దరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- పేదల కుటుంబాలకు ఆర్థిక ఇక్కట్లు
- ప్రభుత్వం ఆదుకోవాలి : బాధితులు


ప్రమాదం జరిగిన ప్రదేశం


మరణించిన రజియా బీ, రహమత్‌బీ (ఫైల్‌)


గాయాల పాలైన తల్లికుమారులు ఆయేషాబీ, చిన్నారి అబ్దుల్‌ అజీజ్‌

బద్వేలు : అవగాహన రాహిత్యంతో చోటు చేసుకున్న గ్యాస్‌ ప్రమాద ఘటన పోరుమామిళ్లలోని ఐదు కుటుంబాల్లో విషాదం నింపింది. ఇప్పటికే ఇద్దరు బాధితులు ప్రాణాలు కోల్పోగా ఒక కుటుంబం పూట గడవక ఇబ్బందులు పడుతోంది. మరో ఇద్దరూ ఇప్పటికీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోరుమామిళ్లలోని పాత పోస్టాఫీస్‌ వీధిలో రజియా బీ చిన్న గదిలో టిఫెన్‌ సెంటర్‌ నిర్వహిస్తూ జీవనం సాగించేది. ఈమె భర్త చిన్న మాబు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల మూడో తేదీన ఉదయం టిఫెన్‌ సెంటర్‌లో గ్యాస్‌ లీకైంది. రజియా బీ గదిలోకి వెళ్లి లైట్‌ వేయగానే మంటలు వ్యాపించి ఆమె తీవ్రంగా గాయపడింది. ఆదే సమయంలో వాకింగ్‌కు, పనుల నిమిత్తం వెళుతున్న మరో నలుగురు మంటలు అంటుకుని గాయపడ్డారు. వీరిలో రహమత్‌బీ అనే మహిళ నాలుగు రోజుల పాటు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఏడో తేదీన చనిపోయారు. రజియా బీ పదో తేదీన కర్నూలులో చికిత్స పొందుతూ మరణించారు. అదే ప్రమాదంలో తల్లి ఆయేషా బీ(35)తో పాటు ఎనిమిదేళ్ల కుమారుడు అబ్దుల్‌అజీజ్‌, మాబున్నిసా (48) గాయపడ్డారు. ప్రమాదం వారిని విషాదంతో పాటు ఆర్థిక ఇబ్బందులకు గురి చేసింది.

- రజియా బీ మొదట కడప, అనంతరం, కర్నూలులోని ప్రయివేట్‌ ఆసుపత్రిల్లో చికిత్స పొందారు. దాదాపు రూ.2.50లక్షలకు పైగా ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయిందని ఆమె భర్త చిన్న మాబు పేర్కొన్నారు. ఏ రోజుకారోజు కూలీతో కుటుంబం గడుపుకునే తమకు ఈ ప్రమాదం అప్పుల పాలు జేసిందని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.
- రహమత్‌ బీ కూడా కూలి పనులతో కుటుంబాన్ని పోషిస్తుండేది. భర్త అనారోగ్యంతో లారీ డ్రైవర్‌గా పని చేస్తూ ఉద్యోగం మానేశారు. ఆమె మరణంతో భర్త, చదువుకునే కుమారులు ఇబ్బందుల పాలయ్యారు.
- ఆయేషా బీకి భర్త లేడు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా ప్రమాదంలో ఆమెతో పాటు కుమారుడు గాయాలపాలయ్యారు. ఆమె కూలీకి వెళ్లి కుటుంబాన్ని పోషించేవారు. ఆమె గాయాలపాలై ఆసుపత్రిలో చేరడంతో వృద్ధులైన ఆమె తల్లిదండ్రులు చిన్నారుల ఆలనపాలనా చూసేందుకు ఆగచాట్లు పడుతున్నారు. గాయాలు మానేందుకు మరో నెల పట్టే అవకాశం ఉండటంతో అప్పటి వరకు పిల్లలను ఎలా పోషించాల నేది అర్థం కావడం లేదని ఆమె వాపోతోంది. గాయాలపాలైన మాబున్నీసా పరిస్థితి ఇప్పటికీ ఇబ్బందికరంగానే ఉంది. రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. పేదలైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

విజిలెన్స్‌ ఆఫీసర్‌ పేరుతో బెదిరింపులు : కేసు నమోదు

కడప అర్బన్‌ : విజిలెన్స్‌ ఆఫీసర్‌ పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ వారిని బెదిరింపులకు గురిచేస్తున్న పెండ్లిమర్రి మండలానికి చెందిన నంద్యాల వెంకట గంగరాజుపై కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్‌ సీఐ ఎన్‌వీ నాగరాజు తెలిపారు. కడప స్మిత్‌ రోడ్డులో నిహార్‌ స్కిల్‌ ఎడ్యుకేషన్‌ ఇన్‌స్టిట్యూట్‌ స్కిల్‌ ట్రైనింగ్‌సెంటలో వివిధ రకాల శిక్షణలను ఇస్తూ వారికి ప్రభుత్వం తరుపున ప్రయోజనాన్ని చేకూరేలా చేస్తున్నట్లు మేనేజర్‌ షేక్‌ ఖాదర్‌బాషా తెలియజేశారు. కొంతకాలంగా ఓ అపరిచిత వ్యక్తి తమను అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేస్తూ భయాందోళనలకు గురి చేసేవాడన్నాడు. తాను విజిలెన్స్‌ ఆఫీసర్‌ అని, రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేసేవాడు. శనివారం సాయంత్రం ఇన్‌స్టిట్యూట్‌ వద్దకు వెళ్లిన నిందితుడు నంద్యాల వెంకట గంగరాజు మేనేజర్‌ షేక్‌ ఖాదర్‌బాషా ఐడీ కార్డును చూపాలని నిలదీశారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. పరస్పరం ఘర్షణకుపాల్పడ్డారు. ఈ క్రమంలో జనం పోగవడంతో నిందితుడు పరారయ్యాడు.షేక్‌ ఖాదర్‌బాషా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా స్పెషల్‌ డ్రైవ్‌

కడప అర్బన్‌ : వాహనదారులు హెల్మెట్‌, సీటు బెల్ట్‌ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎస్‌ అన్బురాజన్‌ పేర్కొన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన స్పెషల్‌ డ్రైవ్‌లో మొత్తం 278 కేసులు నమోదు చేశారు. ఇందులో హెల్మెట్‌ లేని కేసులు 256, సీటు బెల్ట్‌ ధరించని వారిపై 22 కేసులు నమోదు చేశారు.

రూ. 80 లక్షల దోపిడీ కేసులో ముగ్గురు అరెస్టు

గత డిసెంబరులో బెంగళూరులో ఘటన

శివాజీనగర : బెంగళూరులో పట్టపగలే కారుతో సహా రూ.80 లక్షలు నగదు దోచుకొన్న కేసులో ముగ్గురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు విల్సన్‌గార్డన్‌ పోలీసులు తెలిపారు. నిందితులు శివరామకృష్ణ యాదవ్‌ (19) షేక్‌ చింపతి లాల్‌ బాషా (36), షేక్‌ చింపతి జాకీర్‌ (27). నిందితులది కడప జిల్లా అని సమాచారం.

కారు, నగదుతో ఉడాయింపు ..

గత ఏడాది డిసెంబర్‌ 27న తుమకూరులో వక్క మండీ యజమాని మోహన్‌ తన పనివాళ్లు కుమారస్వామి, చందన్‌లకు రూ. 80 లక్షల నగదు ఇచ్చి బెంగళూరులో ఇవ్వాలని పంపించాడు. మధ్యాహ్నం వారిని బెంగళూరు శాంతినగరలో కేఎహెచ్‌.రోడ్డు వద్ద పోలీస్‌ అనే స్టిక్కర్‌ అతికించిన కారులో వచ్చి దుండగులు అడ్డుకున్నారు. ఇద్దరు దుండగులు కారులో ఎక్కి ముందుకు పోనిచ్చారు. తెలుగులో మాట్లాడుకొని లాఠీ చూపించి కారులో ఉన్నవారిని బెదిరించి దించేసి కారు, అందులోని నగదుతో ఉడాయించారు.

నిందితులు దోచుకొన్న రూ.80 లక్షల్లో కొంతసొమ్మును అప్పులవారికిచ్చి రెండు రోజుల తరువాత బెంగళూరుకు తిరిగి వచ్చారు. ఓ హోటల్‌లో రూ. ఐదు లక్షల సొమ్ముతో అందర్‌ బాహర్‌ ఆట ఆడి కోటి రూపాయలను గెలుపొందారు. తర్వాత మరో హోటల్‌లో అందర్‌ బాహర్‌ ఆడి వెనుక గెలుచుకున్న రూ. కోటిని కోల్పోయారు. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లినవారు అక్కడ కూడా అందర్‌ బాహర్‌ ఆడి మొత్తం రూ.80 లక్షల నగదును కోల్పోయారు. ఈలోపు హలసూరు గేట్‌, విల్సన్‌ గార్డెన్‌ పోలీసులు పలు విధాలుగా దర్యాప్తుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్‌ చేశారు. వారి నుంచి రూ.37 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. లాల్‌ బాషా, జాకీర్‌లు అన్నదమ్ములు కాగా, చోరీ, దోపిడీలు, ఎర్ర చందనం స్మగ్లింగ్‌తో పాటు 80కి పైగా కేసులున్నట్లు తెలిసిందని సెంట్రల్‌ డీసీపీ శ్రీనివాస్‌గౌడ తెలిపారు.

తెలుగును ఉచ్ఛరించలేని లోకేష్‌
తెలుగు జాతిని ఉద్ధరిస్తాడా..!

- రాష్ట్రంలో ఏ సమస్యలున్నాయని యాత్రలు చేస్తున్నారు
- దత్తపుత్రుడు, ఉత్తపుత్రుడి యాత్రలను ప్రజలు హర్షించరు
- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : తెలుగు పదాలను సక్రమంగా ఉచ్ఛరించలేని నారాలోకేష్‌ తెలుగు జాతిని ఎలా ఉద్ధరిస్తాడని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రొద్దుటూరు మున్సిపల్‌ కార్యాలయంలోని చైర్‌పర్సన్‌ ఛాంబర్‌లో శనివారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక వైపు యువగళం పేరుతో లోకేష్‌ పాదయాత్ర, మరో వైపు వారాహి పేరుతో పవన్‌ కల్యాణ్‌ రథయాత్ర చేస్తున్నారన్నారు. ఉత్తపుత్రుడు తండ్రికి అధికారాన్ని కట్టబెట్టేందుకు పాదయాత్ర చేస్తే, దత్తపుత్రుడేమో సీఎం జగన్‌పై పగతో రథయాత్ర చేస్తున్నాడన్నారు. ఇద్దరికీ ప్రజలపై ప్రేమ లేదని ఎమ్మెల్యే తెలిపారు. వీరికి ప్రజల వైపు నుంచి వినాల్సిన సమస్యలు ఏమున్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సమస్యను ప్రజలకు చెప్పగలుగుతారని ఎమ్మెల్యే అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని యువతకు ఒకే సారి 1.46 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డిదని తెలిపారు. సచివాలయాలతో పాటు ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ, తదితర శాఖల్లో రాష్ట్రంలో మొత్తంగా 6.05 లక్షల మంది ఉద్యోగులు పెరిగారన్నారు. ఏ వాగ్దానం నెరవేర్చలేదని లోకేష్‌ పాదయాత్ర చేస్తున్నాడని ఎమ్మెల్యే అడిగారు. 2014 నుంచి 19 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి పాదయాత్ర చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు చేసిన పాలనను నరకాసుర పాలనగా ఎమ్మెల్యే అభివర్ణించారు. డ్వాక్రా, రైతు రుణాలను మాఫీ చేస్తానని మహిళలను, రైతులను బాబు మోసం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సక్రమమైన రామరాజ్యం అందిస్తున్న ఈ తరుణంలో ప్రజల వైపు నుంచి ఎలాంటి సమస్యలు, విమర్శలు రావని ఎమ్మెల్యే అన్నారు. అమృతం లాంటి తెలుగుభాషను లోకేష్‌ వంకర టింకరగా పలకడం చూస్తే బాధేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు.

మంగళగిరిలో గెలవలేని లోకేష్‌ రాష్ట్రంలో టీడీపీని గెలిపిస్తాడా..!

మంగళగిరిలో గెలవలేని లోకేష్‌ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తాడా అని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడు, ఉత్తపుత్రుడు కలిసి ఏదో ఒక రూపంలో జగన్‌ను పదవీచ్యుతుడిని చేయాలని ఆరాట పడుతున్నారన్నారు. బాలకృష్ణ లాగా నాలుగు సినిమా డైలాగులు చెప్పడం కోసం స్క్రిప్ట్‌ రాసుకొచ్చి, వచ్చీ రాని తెలుగులో నాలుగు పంచ్‌లు వేయడానికి లోకేష్‌ పాదయాత్రలు చేస్తున్నాడే కానీ రాష్ట్రాన్ని ఉద్ధరించడానికి కాదన్నారు. లోకేష్‌ పాదయాత్ర ప్రారంభించాడో లేదో ఒక వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడన్నారు. తండ్రి కొడుకులు ఎక్కడ కాలుమోపినా అక్కడ ఏదో ఒక అపశ్రుతి జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భీమునిపల్లె లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కుమారుడిని ఇంటిలో వదిలి..
విధులకు వెళుతూ..

రోడ్డుప్రమాదంలో సీఆర్‌పీఎఫ్‌ మహిళా కానిస్టేబుల్‌ మృతి


అరుణాదేవి మృతదేహం

మదనపల్లె (అన్నమయ్య జిల్లా): భార్యాభర్తలిద్దరూ దేశ సేవలో సిపాయిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకుని తమతో పాటు ఉంచుకోలేక విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడ్ని చేద్దామని భర్త ఇంటికి సమీపంలోని ఓ కార్పొరేట్‌ స్కూల్లో చేర్పించారు. సంక్రాంతి సెలవులకు ఆమె పశ్చిమ బెంగాల్‌ నుంచి వచ్చింది.కుమారుడిని పుట్టింటికి తీసుకెళ్లింది.సెలవులు అయ్యాక పిల్లవాడిని అత్తవారింటిలో దింపి విధులకు వెళ్లే క్రమంలో విధి ఆడిన నాటకంలో ప్రాణాలు కోల్పోయింది. బిడ్డను ఒంటరి చేసి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. శనివారం వేకువ జామున మదనపల్లె ఆరోగ్య వరం సమీపంలోని తురకపల్లి వద్ద ఆటో ట్రాక్టర్‌ ఢీ కొన్న ఘటనలో సీఆర్‌పీఎఫ్‌ మహిళా కానిస్టేబుల్‌ అరుణాదేవి (38) మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు..

మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ రాయనచెరువు వడ్డిపల్లెకు చెందిన రవీంద్ర ఇండియన్‌ ఆర్మీలో హవల్దార్‌గా జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్నారు. విజయవాడకు చెందిన అరుణాదేవి పశ్చిమబెంగాల్‌ భారత సరిహద్దుల్లో సీఆర్పీఎఫ్‌ జవాన్‌గా పనిచేస్తోంది. వీరిద్దరి ఏకైక సంతానం హర్షవర్ధన్‌ను చదువుల నిమిత్తం మదనపల్లెలోని కార్పొరేట్‌ పాఠశాలలో చేర్పించారు. అరుణాదేవి సంక్రాంతి సెలవులకు 16న రాష్ట్రానికి వచ్చింది. మదనపల్లెకు వచ్చి కుమారుడిని తీసుకుని విజయవాడకు వెళ్లింది. కొద్దిరోజులు అక్కడ సంతోషంగా గడిపింది. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి బయలుదేరి శనివారం వేకువజామున 3 గంటలకు మదనపల్లెకు చేరుకుంది. స్థానికంగా ఆటోను బాడుగకు తీసుకుని కుమారుడితో పాటు రాయనచెరువు వడ్డిపల్లెకు వెళ్లింది. మెట్టినింట కొడుకును విడిచిపెట్టి, విధులకు వెళుతున్నానని చెప్పి అదే ఆటోలో తిరుగుప్రయాణమైంది. మార్గమధ్యలో తురకపల్లె వద్ద వేకువజామున పొగమంచు కారణంగా ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్‌ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని గమనించి హఠాత్తుగా ఆటోను పక్కకు తిప్పడంతో ట్రాక్టర్‌ ట్రాలీ ఆటోకు తగిలి బోల్తాపడింది. ప్రమాదంలో అరుణాదేవి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను అదే ఆటోలో డ్రైవర్‌ మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగా ఆమె మృతిచెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న బంధువులు, కుమారుడు హర్షవర్ధన్‌ ఆస్పత్రికి చేరుకున్నారు. భార్య మరణించిన విషయాన్ని భర్త రవీంద్రకు తెలిపారు. ప్రమాదఘటనతో రాయనచెరువు వడ్డిపల్లెలో విషాదఛాయలు నెలకున్నాయి. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కవి పోతురాజు సుబ్బన్న మృతి


వెంకటసుబ్బన్న (ఫైల్‌)

సిద్దవటం/కడప కల్చరల్‌ : జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా సేవలందించడంతో పాటు ప్రముఖ కవిగా పేరుపొందిన సిద్దవటం వాసి పోతురాజు వెంకట సుబ్బన్న(84) శనివారం రాత్రి 7.30 గంటలకు మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. కాగా ఉపాధ్యాయుడిగా మంచి పేరు సాధించిన ఆయన ఉద్యోగ విరమణచేసి సాహిత్య వ్యాపకాలతో కాలం గడుపుతున్నారు. పుష్పగిరి క్షేత్రం, సిద్దవటం స్వయం వ్యక్త క్షేత్రం, అస్పృశ్య రాగాలు, పొత్తపినాడు తదితర గ్రంథాలు రాసి జిల్లాలో మంచి కవిగా గుర్తింపుపొందారు. కవన కౌముది బిరుదాంకితుడు. ఈయన ఉపాధ్యాయుడుగా పనిచేసినప్పుడు యూటీఎఫ్‌ జనరల్‌ సెక్రటరీ, ఆలయాల కమిటీ చైర్మన్‌, ఇంటాక్‌, సీపీ బ్రౌన్‌ గ్రంథాలయ సభ్యుడిగా పని చేశారు. వెంకట సుబ్బన్న మృతి పట్ల సాహితీ వేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

బీటెక్‌ విద్యార్థిని ఆత్మహత్య

నారాయణవనం(తిరుపతి జిల్లా): బీటెక్‌ మూడో సంవత్సరం విద్యార్థిని కళాశాల హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం నారాయణవనం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం కురవపల్లెకు చెందిన జనార్ధన్‌రెడ్డి కుమార్తె జ్యోతి (20) మండలంలోని ప్రైవేట్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతోంది. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న జ్యోతి శనివారం తరగతులకు వెళ్లకుండా హాస్టల్‌ గదిలోనే ఉండిపోయింది. కళాశాల ముగిసిన తర్వాత 4.15 గంటల సమయంలో జ్యోతి ఉరివేసుకున్నట్లు హాస్టల్‌ విద్యార్థినులు గుర్తించి అధ్యాపకులకు సమాచారమిచ్చారు. జ్యోతిని వెంటనే పుత్తూరులోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. జ్యోతి శనివారం మధ్యాహ్నం తనతో కూడా మాములుగానే మాట్లాడిందని ఆమె అన్న జశ్వంత్‌ తెలిపారు. జ్యోతి ఆత్మహత్యకు కారణాలను విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

పీఎం కేర్స్‌ పథకానికి దరఖాస్తు చేసుకోండి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : చట్టబద్ధంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు కరోనా కారణంగా మరణించి ఉంటే వారి పిల్లలకు (18 సంవత్సరాలలోపు) అందించే పీఎం కేర్స్‌ పథకం కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి ఎం.ఎన్‌ రాణి ఒక ప్రకటనలో తెలిపారు.వివరాలకు కడప రెవెన్యూ డివిజన్‌ పీఆర్‌ సునీత రాజు (9652971566), జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌ జి.మహేశ్వర (9948779114), బద్వేలు రెవెన్యూ డివిజన్‌ జి.సునీత (7901597346), పులివెందుల రెవెన్యూ డివిజన్‌ వై.విజయకుమారి (7901597351), రాజంపేట, రాయచోటి రెవెన్యూ డివిజన్లకు సంబంధించి వినోద్‌కుమార్‌ (7013089364)లను సంప్రదించాలన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

– ఇద్దరు నిందితుల అరెస్టు

కేవీపల్లె : వాహనంతో సహా రూ. 8.20 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వడ్లకుంట ప్రాంతం నుంచి ఎర్రచందన అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో బండవడ్డిపల్లె సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ 29 సీటీ 6874 నంబరు గల మహేంద్రా జైలో వాహనాన్ని తనిఖీ చేశారు. 60 కేజీల బరువుగల నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు.వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన రామస్వామి తంగరాజ్‌, కృష్ణగిరికి చెందిన కృష్ణమూర్తి మోహన్‌లను అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, వాహనం విలువ సుమారు రూ. 8.20 లక్షలు విలువ ఉంటుందని చెప్పారు.

బావిలో దూకి..


పీరుల్లా (ఫైల్‌)

కడప అర్బన్‌ : కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌ పరిధిలోని రామాంజేయపురానికి చెందిన షేక్‌ పీరుల్లా (35) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్‌ అనే వ్యక్తి గమనించి పీరుల్లా భార్య యాస్మిన్‌కు ఫోన్‌ చేసి చెప్పాడు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించింది. మృతదేహాన్ని చిన్నచౌకు పోలీసులు రిమ్స్‌కు తరలించారు. తన భర్త అప్పులు అధికంగా చేసి తీర్చలేక మనస్థాపంతో బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు.